# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- మూడు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సీషెల్స్ రాజధాని విక్టోరియాకు చేరుకున్నారు.
- 'భారత్ టాక్సీ' సేవలను రాబోయే రెండేళ్లలో 500 నగరాలు, పట్టణాలకు విస్తరించనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.
- భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' ద్వారా లభించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వ్యాపార వర్గాలకు సూచించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 135వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సీషెల్స్ రాజధాని విక్టోరియాకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ప్రధానమంత్రికి ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ ప్యాట్రిక్ హెర్మినీ స్వాగతం పలికారు. ఈ ఆత్మీయ స్వాగతంపై ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా హర్షం వ్యక్తం చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సీషెల్స్ భారతదేశానికి అత్యంత విలువైన సముద్ర తీర భాగస్వామి, ఆప్తమిత్రుడు అని కొనియాడారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న సుదీర్ఘ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని నరేంద్రమోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడం ద్వారా రెండు దేశాల ప్రజలకు గరిష్ట ప్రయోజనాలు చేకూర్చడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని స్పష్టం చేశారు. విమానాశ్రయం వద్ద లభించిన స్వాగతానికి గాను అక్కడ స్థిరపడిన భారతీయ సమాజానికి ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. సీషెల్స్ దేశ స్వాతంత్ర్య 'స్వర్ణోత్సవ' వేడుకలకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవ వేడుకలకు హాజరవుతున్న తొలి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కావడం విశేషం.

= = = = = = = = = = = = = = = = = = =

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (MSME) రంగం అందించే సహకారం దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం (MSME Day 2026) పురస్కరించుకుని ఈరోజు న్యూఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎంఎస్ఎంఈ రంగం మొదటి తరం పారిశ్రామికవేత్తల ధైర్యానికి, వారిలోని వ్యాపార నైపుణ్యానికి అద్దం పడుతోందని కొనియాడారు. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, దేశం నుంచి జరిగే మొత్తం ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈ రంగం దాదాపు 50 శాతం వాటాను కలిగి ఉండటం విశేషమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

‘భారత్ టాక్సీ’ సేవలను రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 500 నగరాలు, పట్టణాలకు విస్తరించనున్నట్లు కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా ప్రకటించారు. న్యూఢిల్లీలో ‘భారత్ టాక్సీ’ సేవలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార రంగంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని కొనియాడారు. డ్రైవర్లను కార్మికులుగా కాకుండా ‘సారథులు’గా పరిగణిస్తూ, వారిని నేరుగా భాగస్వామ్యులను చేయడం ద్వారా పారదర్శకమైన, నిష్పాక్షికమైన రవాణా వ్యవస్థను నిర్మిస్తున్నామని అమిత్ షా స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల డ్రైవర్లకు వారి సంపాదనలో సింహభాగం దక్కుతుందని, అదే సమయంలో ప్రయాణికులకు కూడా సురక్షితమైన, సరసమైన ధరలకే ప్రయాణ సేవలు అందుతాయని పేర్కొంటూ…

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో ‘జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సు-2026’ రేపు ప్రారంభం కానున్నది. రెండు రోజుల పాటు సాగే ఈ సదస్సులో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ పథకాల పురోగతిని సమీక్షించడంతో పాటు, గ్రామీణ భారత అభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఈ సదస్సులో ఖరారు చేయనున్నారు. ముఖ్యంగా ‘విబి-జి రామ్ జి’ (VB-G RAM G) చట్టం అమలు, గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రణాళికా రచనల బలోపేతం, నిధుల సంపూర్ణ వినియోగం వంటి అంశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ ఆరోగ్య రంగంలో డిజిటల్ సేవలను మరింత విస్తరిస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ఈ నెల 29న న్యూఢిల్లీలో పలు డిజిటల్ వినూత్న సేవలను ప్రారంభించనున్నారు. కోవిడ్ సమయంలో ఎంతో ఉపయోగపడిన ఆరోగ్య సేతు యాప్‌ను ఇప్పుడు మరిన్ని అధునాతన పర్సనల్ హెల్త్ రికార్డ్ ఫీచర్లతో సరికొత్తగా ‘ఆరోగ్య సేతు 2.0’ గా తీసుకువస్తున్నారు. లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేసేందుకు వాట్సాప్ ఆధారిత ఆయుష్మాన్ సారథి చాట్‌బాట్, ఆసుపత్రుల క్లినికల్ విధానాల డిజిటలైజేషన్ కోసం ఇ-సుశ్రుత్ క్లినిక్ యాప్‌ను తీసుకువస్తున్నారు. ఈ సరికొత్త డిజిటల్ సేవలు వైద్య రంగంలో భాగస్వామ్యులైన ఆసుపత్రులు, బీమా సంస్థలు, రోగుల మధ్య సమాచార మార్పిడిని మరింత సులభతరం చేస్తాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే… ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారత్-బ్రిటన్ (UK) మధ్య కుదిరిన 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' (CETA) ద్వారా లభించే సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ వ్యాపార వర్గాలకు పిలుపునిచ్చారు. లండన్‌లో ఈరోజు ‘ఇండియా-యూకే పార్ట్‌నర్స్ ఇన్ ప్రోగ్రెస్ బిజినెస్ ప్లీనరీ జరిగింది. ఇరు దేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వాణిజ్య ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా ఇరుదేశాలకు గొప్ప ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయన్నారు. బ్రిటన్ కంపెనీలతో భారతీయ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని కేంద్ర మంత్రి సూచిస్తూ…

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోనే మొట్టమొదటి కాపర్-క్లోరిన్ (Cu-Cl) థర్మోకెమికల్ సైకిల్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని అణుశక్తి శాఖ కార్యదర్శి అజిత్ కుమార్ మహంతి ఈరోజు ప్రారంభించారు. తమిళనాడులోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (IGCAR)లో ఉన్న 'ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్' (FBTR) నుంచి వెలువడే అణు ఉష్ణ శక్తి ఆధారంగా ఇది పనిచేస్తుంది. ముంబైలోని 'బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్' (BARC) స్వదేశీ సాంకేతికతతో రూపకల్పన చేసిన ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరీక్షించేందుకు ఈ అత్యాధునిక ప్లాంట్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

డిజిటల్ ఇండియా కార్యక్రమం 11 ఏళ్ల మైలురాయిని చేరుకుంటోంది. సామాన్య పౌరుడికి సాంకేతికతను చేర్చడమే ధ్యేయంగా.. 2015 జూలై 1వ తేదీన ప్రారంభమైన 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం.. నేడు కృత్రిమ మేధ, సెమికండక్టర్ల తయారీ, చౌకైన ఇంటర్నెట్ కనెక్టివిటీ ఆధారంగా దేశాన్ని సరికొత్త వృద్ధి పథంలో నడిపిస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గడిచిన 11 ఏళ్లలో ఇంటర్నెట్ కనెక్టివిటీ దాదాపు నాలుగు రెట్లు పెరగడమే కాకుండా, నాడు జీబీ (GB) డేటా ధర 269 రూపాయలు ఉండగా, నేడు అది కేవలం 8 రూపాయల నుండి 10 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల ప్రపంచంలోనే అత్యంత చౌకగా డిజిటల్ సేవలు అందిస్తున్న దేశంగా భారత్ అవతరించింది.

= = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలో జరుగుతున్న యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఈరోజు జరిగిన క్వార్టర్ ఫైనల్స్ పోరులో భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్‌తో పాటు రౌనక్ చౌహాన్, దేవిక సిహాగ్ తమ ప్రత్యర్థులపై విజయాలు సాధించి సెమీఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో దేవిక సిహాగ్, జపాన్ క్రీడాకారిణి రికో గుంజి ను వరుస గేముల్లో ఓడించి సెమీస్‌లో అడుగుపెట్టింది. భారత సీనియర్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌లో చైనీస్ తైపీకి చెందిన లియావో జువో-ఫు పై విజయం సాధించి సెమీస్‌కు చేరాడు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =